వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

పోటాపోటీ..!

◆ పంచాయతీ ఉప ఎన్నికల్లో అధికార వైసిపికి టిడిపి గట్టి పోటీ ◆ సర్పంచి స్థానాల్లో ఒకటి వైసిపి, ఒకటి టిడిపి గెలుపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గ్రామం పంచాయతీల్లో జరిగిన ఉపఎన్నికల్లో అధికార వైసిపికి ప్రతిపక్ష టిడిపి గట్టిపోటీనే ఇచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు సర్పంచి స్థానాలకు, 24 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఇందులో సర్పంచి స్థానాల్లో ఒకటి అధికార వైసిపి మద్దతుదారులు విజయం సాధించగా, మరొకటి టిడిపి మద్దతుదారులు విజయం సాధించారు. వార్డుల్లో 13 వార్డుల్లో వైసిపి మద్దతుదారులు గెలుపొందారు. 11 వార్డుల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు విజయం సాధించారు. రెండు జిల్లాల్లోనూ పంచాయతీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా సాగాయి.

సర్పంచులు చెరొకటి

సత్యసాయి జిల్లాలోని హిందూపురం మండలంలోని చలివెందుల గ్రామ పంచాయతీ సర్పంచి ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికను అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రెండూ ప్రతిష్టాత్మకంగానే తీసుకుని ప్రచారం చేశాయి. ఇక్కడ వైసిపి మద్దతుదారుడు ఉపేంద్రకుమార్‌రెడ్డి 337 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అంతకు మునుపు గ్రామ సర్పంచిగా ఉపేంద్ర తల్లి ఉండేది. ఆమె మరణంతో ఖాళీపడిన ఈస్థానానికి ఇప్పుడు జరిగిన ఈ ఎన్నికల్లో ఆయన గెలుపొందారు. ఇక అనంతపురం జిల్లాలో యల్లనూరు మండలంలో జగ్గంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచి ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో టిడిపి మద్దతుదారుడు కుళ్లాయప్ప విజయం సాధించారు.

టిడిపిలో జోష్

స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైసిపితో పోటీపడి మెరుగైన స్థానాల్లో విజయం సాధించడంతో టిడిపి శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ఇది ఒక శ్యాంపుల్ సర్వేలా ఉందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో టిడిపికి అంత సానుకూలత లేదన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో నెలకొంది. ఇప్పుడు గ్రామ పంచాయతీకి జరిగిన వార్డుల్లోనూ, సర్పంచి స్థానాల్లోనూ మెరుగైన ఓట్లు రావడం చూసి ఆనందపడిపోతున్నారు, అధికార వైసిపి తమ అధికార బలాన్ని ప్రయోగించినా తమ మద్దతుదారులకు గట్టిపోటినిచ్చారని చెబుతున్నారు. అధికార వైసిపి మాత్రం ఈ ఎన్నికలను తాము అంత సీరియస్‌గా తీసుకోలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా స్థానిక సంస్థల ఉప ఎన్నికల పోరు రసవత్తరంగానే సాగింది. ఈ ఎన్నికలను రాజకీయ విశ్లేషకులు సైతం నిశితంగానే పరిశీలిస్తున్నారు. రాబోయే సాధారణ ఎన్నికలకు ఇవి శ్యాంపుల్ సర్వేలనే భావించాల్సి ఉంటుందంటున్నారు.

ప్రశాంతంగా సాగిన ఎన్నికలు

ఉప ఎన్నికలు రెండు జిల్లాల్లోనూ ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఏడు గంటలకు అన్ని చోట్ల పోలింగ్ మొదలైంది. సాయంత్రం ఓట్ల లెక్కింపు కూడా పూర్తయి ఫలితాలను వెల్లడించారు. ఎక్కడా చిన్నపాటి ఘర్షణ, వివాదం లేకుండా సాఫీగా సాగాయి.

యల్లనూరు మండలం బొప్పేపల్లి గ్రామంలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

శ్రీ సత్యసాయి జిల్లా

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మొత్తం 28 వార్డులు, ఒక సర్పంచి స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఒకే నామినేసన్ దాఖలు కావడంతో 15 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన హిందూపురం మండలం చలివెందుల సర్పంచి స్థానానికి, 13 పంచాయతీల్లో 13 వార్డులకు శనివారం నాడు ఎన్నికలు నిర్వహించారు. జిల్లా పరిధిలో 13 వార్డులకు ఉపఎన్నిక జరగ్గా ఇందులో 7 టిడిపి మద్దతుదారులు, 6 వైసిపి మద్దతుదారులు గెలుపొందారు. ఇక హిందూపురం మండలం చలివెందుల సర్పంచి స్థానానికి జరిగిన ఎన్నికలో వైసిపి మద్దతుదారుడు విజయం సాధించారు.

శ్రీ సత్యసాయి వార్డు ఉప ఎన్నికల ఫలితాలు

మండలం	పంచాయతీ	వార్డు స్థానం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
అగళి	అగళి	2	లక్ష్మీనరసింహ్మమూర్తి	టిడిపి
అమడగూరు	చిన్నగానపల్లి	3	దేవరాజు	టిడిపి
అమడగూరు	అమడగూరు	11	నారాయణస్వామి	వైసిపి
అమరాపురం	నిద్రగట్ట	4	కెంచమ్మ	టిడిపి
బత్తలపల్లి	తంబాపురం	3	లక్ష్మీనారాయణమ్మ	వైసిపి
బుక్కపట్నం	క్రిష్ణాపురం	7	మంజుల	వైసిపి
గాండ్లపెంట	మల్లమీదపల్లి	9	విజయ	వైసిపి
గోరంట్ల	గోరంట్ల	18	నరసింహ్మప్ప	వైసిపి
గుడిబండ	గనేమోరుబాగల్	10	నరసింహ్మప్ప	టిడిపి
లేపాక్షి	పులమతి	10	నవీన్	టిడిపి
రొద్దం	రొద్దం	3	ఈశ్వరప్ప	టిడిపి
సోమందేపలి	బ్రహ్మసముద్రం	2	కంబాలప్ప	వైసిపి
తలుపుల	ఉడుములకుర్తి	4	రమేష్‌నాయుడు	టిడిపి

సర్పంచి స్థానం

మండలం	పంచాయతీ	గెలిచిన అభ్యర్థి	పార్టీ	మెజార్టీ
హిందూపురం	చలివెందులు	ఉపేంద్రకుమార్‌రెడ్డి	వైసిపి	337

అనంతపురం జిల్లా

అనంతపురం జిల్లా వ్యాప్తంగా 33 వార్డులు, రెండు సర్పంచి స్థానాలకు ఎన్నికల నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 22 వార్డులతో పాటు పెద్దపప్పూరు మండలం దేవునిఉప్పలపాడు సర్పంచి స్థానంకు ఒకే నామినేషన్ దాఖలు కావడంతో అక్కడ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఇక మిగిలిన 11 వార్డులతో పాటు యల్లనూరు మండలం జంగంపల్లి సర్పంచి స్థానానికి శనివారం నాడు ఎన్నికలు నిర్వహించారు. జిల్లా పరిధిలో 11 వార్డులకు జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి మద్దతుదారులు 5, వైసిపి మద్దతుదారులు 6 స్థానాల్లో గెలుపొందారు. ఇక యల్లనూరు మండలం జంగంపల్లి పంచాయతీ సర్పంచి ఎన్నికల్లో టిడిపి మద్దతుదారుడు విజయం సాధించారు.

అనంతపురం వార్డు ఉప ఎన్నికల ఫలితాలు

మండలం	పంచాయతీ	వార్డు స్థానం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
యల్లనూరు	బొప్పేపల్లి	3	మంజుల లీలావతి	వైసిపి
పుట్లూరు	చెర్లోపల్లి	1	నాగలక్ష్మి	టిడిపి
నార్పల	నార్పల	8	నాగభూషణం	టిడిపి
గార్లదిన్నె	బూదేడు	9	సుంకమ్మ	వైసిపి
కూడేరు	కలగళ్ల	9	మల్లేశ్వరి	టిడిపి
గుత్తి	లచ్చానుపల్లి	7	సుగణమ్మ	వైసిపి
గుత్తి	చెర్లోపల్లి	4	పుల్లన్న	వైసిపి
గుత్తి	ధర్మాపురం	4	ఆంజనేయ	టిడిపి
యాడికి	రాయలచెరువు	12	లక్ష్మిదేవి	టిడిపి
యాడికి	యాడికి	19	శ్రీరాములు	వైసిపి
పెద్దవడుగూరు	జి.వెంకటాంపల్లి	4	లక్ష్మిదేవి	వైసిపి

సర్పంచి స్థానం

మండలం	పంచాయతీ	గెలిచిన అభ్యర్థి	పార్టీ
యల్లనూరు	జంగంపల్లి	కుళ్లాయప్ప నాయుడు	టిడిపి

'అనంత'ను కరువు జిల్లాగా ప్రకటించాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వర్షాభావంతో పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో రాప్తాడు మండలం, రామినేపల్లి గ్రామంలో సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాలు రాక పంటలు సాగు చేయక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. సాగు చేసిన రైతుల పంటలు ఎండి నష్టపోయారని తెలిపారు. వేరుశనగ 2.31 లక్షలు హెక్టార్లలో సాగు కావాల్సి ఉంటే ఒక లక్ష 16 వేల హెక్టార్లు మాత్రమే సాగు జరిగిందన్నారు. సాగు చేసిన పంట కూడా జులై ఆగస్టు నెలలో వర్షాలు రాక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. వేరుశనగ ఊడలు దిగే సమయంలో వర్షం రాకపోవడంతో వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతినిందన్నారు. కావున ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా పెసర, ఉలవలు, సజ్జ, ఆముదం, జొన్న, అనుములు, కొర్రలు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి ఎం. పోతులయ్య, రైతులు లింగన్న, నారాయణ, కొండారెడ్డి, మేకల లింగన్న, వెంకటరాముడు, భాషా తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ నూతన స్టాండింగ్ కమిటీ ఎన్నికల నిర్వహణకు కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు సంఘం కార్యదర్శి సంఘం శ్రీనివాసులు శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో భాగంగా 21 నుంచి 27వ తేదీ వరకూ నామినేషన్ పత్రాల ప్రచురణ, 28న పత్రాలు పరిశీలన, 28న జాబితా ప్రచురణ, 29. మధ్యాహ్నం మూడు గంటల లోపు నామినేషన్ గడువు విధించారు అదే రోజు సాయంకాలం పోటీ అభ్యర్థులు జాబితాను ప్రచురిస్తారు ఈనెల 31వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పోలింగ్, అదేరోజు కార్పొరేషన్ కార్యాలయంలోని నూతన భవనంలో ఓట్ల లెక్కింపు, ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఫ్యాప్టో ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు బకాయి ఉన్న రెండు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఎస్.సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ లింగమూర్తి, కో ఛైర్మన్ గోవిందరాజులు డిమాండ్ చేశారు. శనివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో నగరంలోని డిఇఒ కార్యాలయంలో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు నిరసన తెలిపినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లి అక్కడ పని చేస్తుంటే వేతనాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందన్నారు. పదోన్నతలు పొందింన ఉపాధ్యాయులకు వేతనాలు అందని పరిస్థితి ఉందన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కో ఛైర్మన్‌లు పురుషోత్తం, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులు కోటేశ్వరప్ప, లింగమయ్య, సూర్యుడు, జార్జ్, రవీంద్ర, చంద్రశేఖర్, నాగేంద్ర, నాగరాజు, సతీష్,శ్యామ్ రవి, సర్దార్, రవి, హనుమంతు, కదిరప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి

నేడు హాట్‌బాక్సులు వెనక్కి ఇచ్చి నిరసన - సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న చేపట్టనున్న చలోవిజయవాడ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు కప్పల నాగభూషణం, జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్లు కావస్తున్నా మున్సిపల్ కార్మికుల తలరాతలు మారలేదన్నారు. అంతేగాకుండా అవార్డుల పేరిట మున్సిపల్ కార్మికులకు ఉన్నతాధికారులు రూ.50 విలువజేసే హాట్‌బాక్సులు (చిప్ప)లు ఇచ్చి అవమానించడం బాధాకరమన్నారు. వీటిని ఆదివారం వెనక్కి ఇచ్చి నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీవో 010 ప్రకారంగా వేతనాలివ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ అమలు చేయాలని, రెగ్యులర్ కార్మికులకు రెండేళ్ల బకాయి సెల్‌డర్ లీవ్‌లు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేస్తూ, ఒపిఎస్ అమలు చేయాలని, జిపిఎఫ్ అకౌంట్ ఓపెన్ చేయాలని, నగరాలకు అనుకూలంగా కార్మికుల సంఖ్య పెంచాలని, కోవిడ్, మలేరియా, గార్బేజ్, కార్మికులను ఔట్‌సోర్సింగ్ కార్మికుల గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24వ చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు బండారి స్వామి, మురళి, మల్లి, గౌరీ, ఓబుళపతి, సూరి, సురేష్, కాంతమ్మ, వెంకటలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు

'సంగ్రామ సైకిల్ యాత్ర'ను జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంగ్రామ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ఉరవకొండలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వాటి పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సైకిల్ యాత్రను నిర్వహిస్తోందన్నారు. ఈ యాత్ర ఆగస్టు 23వ తేదీ తాడిపత్రిలో ప్రారంభమై గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, కణేకల్, రాయదుర్గం, కళ్యాణదుర్గం మీదుగా ఈనెల 30న అనంతపురం చేరుకుంటుందన్నారు. ప్రధానంగా జిల్లాలోని సెంట్రల్ యూనివర్శిటీకి సంబంధించి తొమ్మిదేళ్లు పూర్తవుతున్నా కనీసం ప్రహరీ నిర్మాణం కూడా పూర్తి చేయలేదన్నారు. అలాగే సంక్షేమ హాస్టల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. భవనాలకు పెచ్చులు ఊడిపోయి శిథిలావస్థకు చేరినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలను ఇవ్వడం లేదన్నారు. శింగనమల, ఉరవకొండ, తాడిపత్రి, ఆత్మకూరు, గుత్తి జూనియర్ కళాశాలలో సరైన సదుపాయాలు లేవన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి అనుబంధ హాస్టళ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇకపోతే జిల్లావ్యాప్తంగా నారాయణ, చైతన్య, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులు అడ్డగోలుగా పెంచి వసూలు చేస్తుంటే ఇప్పటి వరకూ చర్యలు తీసుకున్న పాపానపోలేదన్నారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని చేపట్టనున్న సైకిల్‌యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉరవకొండ మండల నాయకులు సింహాద్రి, లింగేష్, మహేష్, బన్ని, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డిఇఒ సాయిరాంకు అస్వస్థత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా విద్యా శాఖ అధికారి సాయిరాంకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శనివారం సాయంత్రం ఇంట్లో ఉండగా అస్వస్థకు లోనై కిందపడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు హూటాహుటిన కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు నిర్ధారించి వైద్య చికిత్సలు అందించారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయ సంఘాలు, అధికారులు, ఉపాధ్యాయులు ఆసుపత్రి వద్దకు భారీగా చేరుకున్నారు. ఆరోగ్యంగా కోరుకుని క్షేమంగా రావాలని ప్రార్థించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డిఇఒ సాయిరాం

రిలేదీక్షలను విరమించిన తాగునీటి పథకం కార్మికులు

20 నుంచి పంప్‌హౌస్‌ల వద్ద నిరసనలు - 25 నుంచి నిరవధిక సమ్మె : స్ట్రగుల్ కమిటీ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలేదీక్షలను శనివారం విరమించారు. దీక్ష చేస్తున్న వారికి స్ట్రగుల్ కమిటీ నాయకులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయి వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కార్మికులు 19 రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు నిర్వహించారని తెలిపారు. గతంలో కూడా అనేక మార్లు నిరసనలు, ధర్నాలు, దీక్షలు చేపట్టిన ప్రభుత్వం స్పందించలేదన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి సిఐటియు, ఐఎఫ్‌టియు, వైఎస్ఆర్‌టియు ట్రేడ్ యూనియన్ నాయకులు కలిసి విన్నవించామన్నారు. నేటికీ పరిష్కారం కాలేదన్నారు. వీధిలేని పరిస్థితిలో ఆగస్టు 25 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు స్ట్రగుల్ కమిటీ నాయకులు తెలిపారు. ఆగస్టు 20 నుంచి 24వ తేదీ వరకూ పని చేసే చోట నిరసనలు చేయాలని స్ట్రగుల్ కమిటీ తీర్మాణించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు రాకూడదనే నిరసనలతో ప్రభుత్వానికి విన్నవించామన్నారు. అయినా స్పందన లేదన్నారు. ప్రజలు కూడా కార్మికులకు మద్ధతుగా నిలవాలని కోరారు. వీరి దీక్షలకు అనంత హక్కుల పోరాట సంఘం నాయకులు సోమర రాహుల్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి కార్మికుల యూనియన్ తిప్పేస్వామి, చిన్న బాబయ్య, రవీంద్ర ఆచారి, ప్రసాద్, ఇమామ్, ఐఎఫ్‌టీయు కార్మికుడు నీలకంఠ, భగవాన్ సత్యసాయి యూనియన్ వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు గోవిందులు పాల్గొన్నారు.

దీక్షలను విరమింపజేస్తున్న స్ట్రగుల్ కమిటీ నాయకులు ఎస్.నాగేంద్రకుమార్

ఎన్ఎస్‌హెచ్ఆర్ యువజన విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియామక పత్రం అందుకుంటున్న సాయిప్రవీణ్

ఎన్ఎస్‌హెచ్ఆర్ యువజన విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శిగా సాయిప్రవీణ్

అనంతపురం : జాతీయ మానవ హక్కుల సంఘం 'ఎన్ఎస్‌హెచ్ఆర్' యువజన విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శిగా సాయిప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక కార్యాలయ ఛాంబర్ ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు సాయితేజ కొండిశెట్టి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో సాయిప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిచోటా హక్కుల ఉల్లంఘన సర్వసాధారణం అయిందన్నారు. ఈ తరుణంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ తరపున గట్టిగా పోరాడి హక్కుల ఉల్లంఘనకు తావు లేకుండా చూడాల కోరారు. వీటి కోసం ఎంత దూరమైనా వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యుడు లాయర్ లక్ష్మణ్, రాష్ట్ర, జిల్లా సభ్యులు మాకే హరీష్, ప్రదీప్, వెంకట్, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉప ఎన్నికలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలో శనివారం జరిగిన పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలవ్యాప్తంగా 6 గ్రామపంచాయతీల్లో ఆరు వార్డులకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉండగా ముగ్గురు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇసురాళ్లపల్లి వార్డు సభ్యులు ఇండిపెండెంట్, అబ్బేదొడ్డి వార్డు సభ్యులు వైసిపి, పెద్దొడి వార్డు సభ్యులు టిడిపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడు వార్డు సభ్యులకు ఎన్నికలు జరిగాయి. అందులో లచ్చానుపల్లిలో 7వ వార్డు వైసీపీ అభ్యర్థి సుగుణమ్మ టిడిపి అభ్యర్థి ఆంజనేయులుపై 29 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. చెర్లోపల్లి లో 4వ వార్డు వైసిపి అభ్యర్థి పుల్లన్న టిడిపి అభ్యర్థి ఓబుల్‌రెడ్డిపై 39 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ధర్మాపురంలో 4వ వార్డు టిడిపి అభ్యర్థి ఎం.అంజనయ్య, వైసిపి అభ్యర్థి వై.సూర్యనారాయణపై 8 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిఐ ఎం.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బూదేడులో వైసిపి అభ్యర్థి విజయం

గార్లదిన్నె : మండల పరిధిలోని బూదేడు గ్రామ పంచాయతీలో 9వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి బలపరిచిన సుంకమ్మ 21 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వార్డులో 147 ఓట్లు పోలవగా సుంకమ్మకు 63, టిడిపి మద్దతుదారులు ఇద్దరు పోటీ చేయడంతో నాగేంద్రకు 40, నాగన్నకు 40 ఓట్లు పోలయ్యాయి. దీంతో టిడిపికి కంచుకోటైన పంచాయతీలో వైసిపి మద్దతుదారు సునాయాసంగా గెలుపొందింది.

పోలింగ్‌ను పర్యవేక్షించిన ఎస్పీ

బూదెడు 9వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలను ఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సమయంలో ఎలాంటి అక్రమాలకు తావివ్వద్దని సిబ్బందికి సూచించారు. ఆయనతోపాటు శింగనమల సిఐ అస్రార్‌బాషా, ఎస్ఐ, సాగర్ ఉన్నారు.

చెర్లోపల్లిలో టిడిపి మద్దతుదారు విజయం

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి పంచాయతీలో 1వ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహించగా టిడిపి మద్దతుదారు నాగలక్ష్మి విజయం సాధించారు. మొత్తం 146 ఓట్లు కాగా 131 పోలయ్యాయి. వీటిలో నాలుగు ఓట్లు చెల్లనిగా ఉండగా 74 ఓట్లు నాగలక్ష్మికి, వైసిపి మద్దతుదారు రాజ్యలక్ష్మికి 53 ఓట్లు రావడంతో 21 ఓట్ల మెజార్టీతో నాగలక్ష్మి విజయం సాధించినట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ దిలీప్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

నార్పలలో టిడిపి మద్దతుదారు విజయం

నార్పల : మండల కేంద్రంలోని 8వ వార్డు ఉప ఎన్నికలో టిడిపి మద్దతుదారు కొత్తమిద్దె నాగభూషణం సమీప ప్రత్యర్థి తలారి ప్రసాద్‌పై 45 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. 900 ఓట్లు ఉండగా 621 ఓట్లు పోలయ్యాయి. వీటిలో టిడిపి మద్దతుదారు కొత్తమిద్దె నాగభూషణంకు 330, సమీప ప్రత్యర్థి ప్రసాద్‌కు 285 ఓట్లు వచ్చాయి. చెల్లని ఓట్లు 5, నోటాకు ఒక ఓటు వచ్చాయి. దీంతో విజయం సాధించిన నాగభూషణంకు అధికారులు డిక్లరేషన్ ఫారం అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సిఐ అస్రార్‌బాషా, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి బందోబస్తు చేపట్టారు. కాగా విజయం సాధించిన నాగభూషణంను టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసనాయుడు, ఆకుల ఆంజనేయులు, వెంకటనరసానాయుడు, టిడిపి నాయకులు అభినందించారు.

జంగంపల్లి సర్పంచిగా టిడిపి మద్దతుదారుడి విజయం

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలోని జంగంపల్లి గ్రామ సర్పంచికి జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి మద్దతుదారు కుళ్లాయప్పనాయుడు ఘన విజయం సాధించాడు. గతంలో ఇక్కడ ఉన్న సర్పంచి చంద్రశేఖర్‌నాయుడు మృతిచెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇందులో భాగంగా శనివారం జరిగిన ఎన్నికల్లో 576 ఓట్లకు 478 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. వీటిలో టిడిపి మద్దతుదారు కుళ్లాయప్పనాయుడుకు 248, వైసిపి మద్దతుదారు కోటేశ్వరనాయుడుకు 230 ఓట్లు వచ్చాయి. 18 ఓట్లతో విజయం సాధించడంతో కుళాయప్పనాయుడుకు అధికారులు ధ్రువీకరణ పత్రం అందజేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ శివారెడ్డి, సీఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్మికుల జీవితాలతో చెలగాటమాడొద్దు

ఉరవకొండ : కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడకుండా న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన వాటర్‌వర్క్స్ కార్మికులు చేస్తున్న సమ్మెకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు స్పందించి వారికి రావాల్సిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఇఎస్ఐ, పిఎఫ్ సొమ్ము ప్రభుత్వమే భరించాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కార్మికులందరికీ సమానపనికి సమాన వేతనం ఇస్తానని చెప్పిన సిఎం జగన్ అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి తాగునీటి సమస్య రాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

రమణమ్మ కుటుంబానికి ఆర్థికసాయం

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన రమణమ్మ భర్త గతనెలలో చనిపోవడంతో ఎంపిపి భూమిరెడ్డి రాఘవరెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవి, పుట్లూరు మండల కన్వీనర్ నాగేశ్వరరావు, పుట్లూరు సర్పంచి రామిగాళ్ల ఓబులేసు, నాయకులు శేఖర్, బాలరాజు, తిరుపతయ్య, గంగాధర్, పవన్, సుబ్బు, పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సిఎం చేసుకుందాం..

నార్పల : వచ్చే 2024 ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని 8వవార్డు ఉప ఎన్నికల్లో గెలుపొందిన టిడిపి మద్దతుదారు కొత్తమిద్ది నాగభూషణను ఆలం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డు గెలుపు రానున్న సాధారణ ఎన్నికలకు మలుపు అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వార్డు ఉప ఎన్నికల ఫలితాలను చూస్తున్న ప్రజలను రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అర్థం అవుతోందన్నారు. ఈ విజయం వెనుక టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : ఎంపిపి

బుక్కరాయసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. శనివారం మండలంలోని కొట్టాలపల్లి మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా తరగతి గదులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అలాగే నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు.

వైభవంగా నారసింహుని ఉత్సవం

రాయదుర్గం రూరల్ : శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా మండల పరిధిలోని మల్లాపురం సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు శ్రీరామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సుబ్రమణ్యంస్వామి ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నైవేద్య పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా గరుడ వాహనంలో అలంకరించిన పల్లకిలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అదిష్టించి ఊరేగించారు. సూర్యప్రకాష్ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, కోశాధికారిరులు సత్యనారాయణ, నరసింహులు, కార్యవర్గ సభ్యులు రాఘవేంద్రప్రసాద్, రామిరెడ్డి, గురునాథ్‌రెడ్డి, కమలాక్షుడు, వెంకట్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

వైసిపి అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం విడపనకల్లు మండలంలోని మాళాపురం, విడపనకల్లులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, వైస్ ఎంపిపి సునీతారాణి, రామాంజనేయులు, ఎంపిడిఓ శ్రీనివాసులు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు, ఎఫ్ఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమేష్, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి దేశాయ్ సిద్ధార్థ, మున్నా, బెస్త ఎర్రిస్వామి, సుంకన్న, హంపయ్య, ఉమాశంకర్, ప్రసాద్, ఉలిగప్ప, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

పంటకోత ప్రయోగాలు చాలా కీలకం

జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో రైతులు పండించే పంటల దిగుబడి, పంటల బీమా అంచనా వేసేందుకు పంటకోత ప్రయోగాలు చాలా కీలకమని జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి వి.అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక పెన్నార్ భవన్‌లోని సిపిఓ సమావేశం హాల్‌లో పంట కోత ప్రయోగాలపై జిల్లాస్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ పంటకోత ప్రయోగాలు, పంటల బీమా కోసం చేసే పంటకోత ప్రయోగాలు ఉంటాయన్నారు. పంట దిగుబడి లెక్కించడానికి ఇది చాలా ముఖ్యమైనది కాబట్టి చాలా పక్కాగా నిర్వహించాలన్నారు. అలాగే వివిధ పంటల్లో ఏ విధంగా పంట కోత ప్రయోగాలు చేయాలన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి మండలంలో రాబోయే వారంలోపు పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. పంట నమోదులో సర్వే నెంబర్‌కు జియో కోఆర్డినేటర్స్ ఇచ్చి పంట నమోదు చేయమని సూచించారు. అలాగే రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రెవెన్యూ అధికారులు పంటను వేసిన ప్రతి సర్వే నెంబర్‌కూ వెళ్లి జాయింట్ అజమాషిగా పంట నమోదు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన అధికారి రఘునాథ్‌రెడ్డి, ఎడిఎలు పద్మజ, వెంకట్రాముడు, ఎం.రవి, యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వి.అశోక్‌కుమార్

ఈక్రాప్ నమోదు యాప్‌లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వం ఈక్రాప్ నమోదు కోసం ఇచ్చిన నూతన యాప్‌లో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించాలని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ కోసం రూపొందించిన యాప్‌లో ఏ సర్వే నెంబర్‌లో అయితే పంట సాగు చేశారో అదే పంట నమోదు చేయాలి. అయితే సర్వే నెంబర్‌లో కోఆర్డినేటర్ యాప్‌లోకి వెళ్లి కెమెరా ఓపెన్ అయ్యి పంట పోటో తీసుకుంటోందన్నారు. దీంతో ఆర్‌బికె సిబ్బంది కొన్ని సందర్భాల్లో ఖచ్చితమైన సర్వే నెంబరుకు వెళ్లినప్పుడు జియో కో-ఆర్డినేటర్స్ డౌన్లోడ్ చేసిన వెంటనే యాప్ లాగ్ అవుట్ అవుతోందన్నారు. యాప్ సరిగ్గా పని చేయకపోవడం వల్ల ఆర్‌బికె సిబ్బంది క్రాప్ బుకింగ్ చేయడంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వరి పంట సాగు చేసిన రైతులు పొలం ఈక్రాప్ బుకింగ్ చేయాలంటే తప్పనిసరిగా వరి మడుల్లోకి వెళ్లి కెమరా ఓపెన్ చేయాలని, అలా చేస్తున్న సందర్భంలో తాము విషపు పురుగులు బారినపడుతున్నామని వాపోయారు. కావున తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్‌బికె ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.నరేష్‌కుమార్, నరసింహా, రాధాకృష్ణ, జిల్లా ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు

లేజర్ మిషన్‌ను ప్రారంభిస్తున్న విశ్రాంత డిఐజి వికె.సింగ్, డాక్టర్ అక్బర్,తదితరులు

లేజర్‌మిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సాయినగర్‌లో ఉన్న డాక్టర్ అక్బర్ కంటి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యంత ఆధునిక లేజర్‌మిషన్‌ను విశ్రాంత డిఐజి వికె.సింగ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అక్బర్ మాట్లాడుతూ విశ్రాంత డిఐజి వికె సింగ్‌కు అనంతపురంతో 25 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. ఇక్కడ ఎస్పీగా పని చేసినప్పుడు సిటిజన్ ఫోరం గౌరవాధ్యక్షులు పని చేసి సేవలు అందించారన్నారు. అలాంటి ఆయనతో లేజర్ మిషన్‌ను ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అక్బర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అల్తాఫ్ అక్బర్, సిఇఒ డాక్టర్ నూర్, డాక్టర్ రాణీ ఐశ్వర్య, డాక్టర్ మిధునారెడ్డి, డాక్టర్ షాజియా, సిటిజన్ ఫోరం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనకదాస విగ్రహ ఏర్పాటుకు విరాళం

ఉరవకొండ : భక్త కనకదాస విగ్రహం ఏర్పాటుకు వైసిపి యువజన విభాగం జోనల్ ఛైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి శనివారం రూ.లక్ష నగదును కురుబ సంఘం నేతలకు అందజేశారు. ఐదేళ్ల క్రితం ఉరవకొండలో రోడ్ల విస్తరణ భాగంగా కనకదాసు విగ్రహం తొలగించి స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉంచారు. అయితే కాల క్రమేణా విగ్రహం దెబ్బతింది. దీంతో నూతన విగ్రహం ఏర్పాటు చేయాలని కురుబలు తలచి విషయాన్ని యువనేత ప్రణయ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పెద్ద మల్లప్ప, గాదిలింగ, జయరాం, చిన్న భీమా, బుదగవి ధనుంజయ, ప్రకాష్, కోనాపురం వెంకటేష్, నీలప్ప, కమ్మడి రామాంజనేయులు, కట్టే బసప్ప, సాయి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నరేంద్రబాబు సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక సప్తగిరి సర్కిల్‌లోని సెంట్రల్ లైబ్రరీలో ఆదివారం కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు కొత్తపల్లి నరేంద్రబాబు కవి సమ్మేళనం సాహిత్య వేదిక వ్యవస్థాపకులు సోదరుడు సాహితీవేత్త అక్షరమాలి సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సోదరుడు నరేంద్రబాబు స్మారకంగా ప్రతిఏటా సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఈసారి గూండ్ల వెంకటనారాయణ 2023 పురస్కార గ్రహీతగా ఎంపికైనట్లు తెలిపారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల : మండలంలోని తరిమెలలో నివాసం ఉంటున్న ఎట్టి చితంబరమ్మ, రోగెన్న కుమార్తె లక్ష్మీ వివాహానికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శనివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థికసాయం అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కుమార్, పుల్లయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని పెద్దాసుపత్రి వద్ద శనివారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి మాట్లాడుతూ అనంతపురానికి చెందిన జి.ఎన్.శ్రీనివాసులు వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షులు కవిన్ ఆదిత్య, సుబ్రమణ్యం, ఓబుళపతి, నబిరసూల్, కిష్టప్ప, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

మృతిచెందిన నాగముని

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరు గ్రామం వద్ద 44 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగముని (65) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాగముని కల్లూరు నుంచి కిరాణా సరుకులు తీసుకుని ముంటమడుగు కొత్తపల్లి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు ఇల్లూరుకు చెందిన ఉప్పర నల్లప్పదిగా గుర్తించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

మృతిచెందిన నరేష్

బుక్కరాయసముద్రం : ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని దండువారిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అంకమ్మ గారి కుళ్లాయప్ప, ఆదినారాయణమ్మ కుమారుడు నరేష్ (28) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నరేష్ కుటుంబం పొట్టేళ్లు, బర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తుండేది. ఇందులో భాగంగానే తల్లి ఆదినారాయణమ్మ వరిమడి నాటేందుకు, తండ్రి కుళ్లాయప్ప పొట్టేళ్లు మేపేందుకు, భార్య జ్యోతి పుట్టింటికి వెళ్లింది. నరేష్ కూడా బర్రెలు మేపేందుకు వెళ్లి ఇంటికి వచ్చి పైకప్పునకు ఉరేసుకున్నాడు. గమణించిన కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే బుక్కరాయసముద్రం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహారాజశ్రీ డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, అనంతపురం
D.R.A.NO:335/2021.
Between:
వజ్రగిరి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం ...డిస్పూటెంట్
-వర్సెస్-
చాకల సూరి ...అపోనెంట్
అపోనెంట్ 1కి నోటీసు
చాకల సూరి S/o Late చాకల నల్లప్ప నివాసం D.No:8-193-B, గుల్జార్ పేట్, అనంతపురం.
డిస్పూటెంట్, డిస్పూట్ బాకీ మొత్తం రూ.1,84,580/-లు రాబట్టు కొనుటకు గాను మీపై దాఖలు చేసిన డిస్పూట్‌లో 1కి అపోనెంట్ అయిన మీరు 20/09/2023వ తేదిన హాజరు అగుటకు గాను వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 11:00 గంటలకు డిప్యూట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o జిల్లా రిజిస్ట్రార్, డోర్ నెం:6-3-134,1వ అంతస్తు, రామ్ నగర్, అనంతపురం వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనంతట డిస్పూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By Ordre of Deputy Registrar of Chit O/o The District Registrar, Registration And Stamps Dept. D.No:6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu.

మహారాజశ్రీ డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, అనంతపురం
D.R.A.NO:336/2021.
Between:
వజ్రగిరి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం ...డిస్పూటెంట్
-వర్సెస్-
M.చిన్న గంగన్న ...అపోనెంట్
అపోనెంట్ 2కి నోటీసు
M.చిన్న గంగన్న S/o M.గంగన్న, నివాసం D.No:13-1-556, Upstairs యర్నాల కోట్టాల, పంచముఖ ఆంజనేయస్వామి టెంపుల్, అనంతపురం.
డిస్పూటెంట్, డిస్పూట్ బాకీ మొత్తం రూ.3,42,320/-లు రాబట్టు కొనుటకు గాను మీపై దాఖలు చేసిన డిస్పూట్‌లో 2కి అపోనెంట్ అయిన మీరు 20/09/2023వ తేదిన హాజరు అగుటకు గాను వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 11:00 గంటలకు డిప్యూట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o జిల్లా రిజిస్ట్రార్, డోర్ నెం:6-3-134,1వ అంతస్తు, రామ్ నగర్, అనంతపురం వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనంతట డిస్పూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By Ordre of Deputy Registrar of Chit O/o The District Registrar, Registration And Stamps Dept. D.No:6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu.

ఎన్నికలపైనే దృష్టి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంత వీక్షణం

జిల్లాలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉమ్మడి జిల్లాలోని47 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. సగానికిగా సాగుభూమి బీడుగానే ఉంది. నీళ్ల లేక ఇప్పటికే రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. భూగర్భజలాలు క్రమక్రమంగా దిగువకు చేరుకుంటున్నాయి. గడిచిన మూడేళ్లలో వర్షాలు కొంత మెరుగ్గా రావడంతో ఊపిరి పిల్చుకున్న రైతులకు ఈఏడాది మళ్లీ కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. అయినా పాలకులకు కరువుపై ఏమాత్రం దృష్టి లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ త్వరలో ముగియనుంది. ఇప్పటికీ జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాల భూమిబీడుగా ఉంది. ఇంత పెద్దఎత్తున బీడుగా ఉన్న సమయంలో ప్రత్యామ్నాయ విత్తనాలిచ్చి చేతులు దులుపుకునే కార్యక్రమం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతవారంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాలోని నియోజకవర్గాల సమీక్ష నిర్వహించారు. అదే సమయంలో సత్యసాయి జిల్లాలోని నియోజకవర్గాల సమీక్షను అక్కడి ఇన్‌ఛార్జి మంత్రి జయరాం చేపట్టారు. ఈరెండు చోట్ల కూడా ప్రధానమైన జిల్లా సమస్యలపై కంటే నియోజకవర్గాల్లో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు, ఇచ్చిన హామీలు వాటి అమలుపైనే ప్రధాన సమీక్ష జరిగింది. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై కనీస ప్రస్తావన ఈ సమీక్షల్లో కనిపించలేదు. పంటలు ఎండిపోతున్న సమయంలో రైతాంగానికి ఆదుకునే చర్యలు చేపడుతున్నట్టు భరోసా కల్పించే విధంగా ఈ సమీక్షలు జరగలేదన్న విమర్శ సర్వత్రా వ్యక్తమవుతోంది. నియోజకవర్గాల్లో జరుగుతున్న పనులు, వాటికున్న ఆటంకాలపైనే చర్చించారు. అది కూడా గోప్యంగానే ఈ సమీక్షలు జరిగాయి. ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఇవి జరిగాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా సమీక్షలు అంటే జిల్లా స్థాయిలో జరిగేవి. ఇందులో అధికారులతోపాటు, ప్రజాప్రతినిదులందరూ హాజరై జిల్లాలోని పరిస్థితులపై సమీక్ష జరిపేవారు. అందులో వచ్చే ప్రధానమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసే చర్యలు చేపట్టేవారు. కాని గత కొంతకాలంగా జిల్లా సమీక్షా సమావేశం సైతం జరగలేదు. నియోజకవర్గ స్థాయిలోనే ఇవి జరుగుతున్నాయి. ఇందులో పాల్గొంటున్నది అధికారపార్టీ నాయకులే కాబట్టి సమస్యలేవి ప్రస్తావ లేకుండానే వారికి ప్రయోజనాలకు అనుగుణంగా సాగాయన్న విమర్శ వ్యక్తమవుతోంది. ఇటీవల కాలంలో రైతాంగ ఆత్మహత్యలు సైతం పెరిగాయి. వీటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న యోచన కూడా ప్రభుత్వం వైపు నుంచి కనిపించడం లేదు. ఇక ఈవారంలో ముందుకొచ్చిన మరో ప్రధాన సమస్య కార్మికులది. కార్మికులు పెద్దఎత్తున ఉద్యమబాటనే పట్టారు. ప్రధానంగా సత్యసాయి వాటర్ వర్కర్సు , శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్సు వేతన బకాయిల కోసం పోరాటం చేపడుతున్నారు. కార్యాలయం ఎదుటే రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈనెల 20 తేదీ నుంచి సమ్మెలోకి సైతం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ప్రతిసారి వేతన బకాయిల కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొంటోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి శాశ్వత పరిష్కారాన్ని చూపే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ సమస్యను పట్టించుకునే నేతలెవరూ కనిపించడం లేదు. కేవలం ఈ బోర్డు పరిధిలో పనులను విభజించి కాంట్రాక్టులు తమకు దక్కించుకోవడంపైనే అందరి దృష్టీ ఉంది తప్ప ఈ ప్రాజెక్టులో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే నేతలెవరూ లేరన్న ఆరోపణలూ ఉన్నాయి.

ఉచిత సామూహిక వివాహాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

నూతన వధూవరులతో పైలా నరసింహయ్య దంపతులు

పైలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, రమాదేవి దంపతులు ఏర్పాటు చేసిన ఉచిత సామూహిక వివాహాల్లో 42 జంటలు ఒక్కటయ్యాయి. ఈ సందర్భంగా పైలా ఫౌండేషన్ వారు బంగారు తాళిబొట్టు, మెట్టెలు, పెళ్లి వస్త్రాలు అందించడమే కాకుండా ఒక్కో జంటకు కుట్టుమిషన్‌ను ఉచితంగా అందించారు. లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా సిఎం జగన్ ఆశీస్సులతో లోక కళ్యాణార్థం ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించినట్లు పైలా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైసిపి యువజన విభాగం జోనల్ ఛైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్‌అహమ్మద్, రజక కార్పొరేషన్ ఛైర్మన్ రంగన్న, అనంతపురం మేయర్ వసీం, వెన్నపూస రవీంద్రారెడ్డి, రమేష్‌రెడ్డి, విఆర్ రామిరెడ్డి, పామిడి వీరా, ఎస్సీ సెల్ నాయకులు ఎగ్గుల శ్రీనివాస్, పెన్నోబిలేసు, మహిళా నేత కృష్ణవేణి, శ్రీదేవి, శోభాబాయి, ధనుంజయ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మోడీ, జగన్ ప్రభుత్వాలను గద్దె దింపాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని జగన్మోహన్‌రెడ్డి ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను గద్దెదింపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ పిలుపునిచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సుయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం మండలంలోని పెన్నఅహోబిలంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 8వతేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 3, 4, 5తేదీల్లో గుత్తి నుంచి బయలుదేరి గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, ప్రాంతాల్లో రోడ్‌షోలు, బహిరంగ సభలు ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమంలో ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, ఉరవకొండ తాలూకా కార్యదర్శి జె.మల్లికార్జున, సహాయ కార్యదర్శి మనోహర్, నాయకులు శివన్న, రామాంజనేయులు, చెన్నరాయుడు, సుల్తాన్, తలారి మల్లికార్జున, పోతులయ్య, ముట్టాల శ్రీరాములు, నబీసాహెబ్, రమణప్ప, రమేష్, శ్రీధర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.